క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించండి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 7వ వార్డు ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మున్సిపల్ డీఈ మధుకర్‌ను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించగా, తాగునీటి సమస్యలు ఉన్నట్లు ప్రజలు చెప్పగానే వెంటనే వాటి పరిష్కారం కోసం అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఆర్థికసాయం అందజేత

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామానికి చెందిన దుర్గం చరణ్‌తేజ్ బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలలో చదివి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించాడు. కాగా ఆదివారం చాకేపల్లి ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్ రూ.10వేలు, ఎన్ఆర్ఐ తోడె కృష్ణారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం చరణ్‌తేజ్‌ను శాలువాతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. నిరుపేద విద్యార్థికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

దండేపల్లి: ఆదర్శపాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆదర్శ పాఠశాలల అసోసియేషన్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24 నుంచి 29వరకు భోజన విరామ సమయంలో రోజుకో తీరుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.

లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా తిరుపతివర్మ

దండేపల్లి: కాంగ్రెస్ లీగల్‌సెల్ వైస్‌చైర్మన్‌గా దండేపల్లి మండలం వెల్గనూర్‌కు చెందిన అక్కల తిరుపతి వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తిరుపతి వర్మకు ఆదివారం నియామక పత్రాన్ని అందించారు.

నూతన కార్యవర్గం

జన్నారం: మండలంలోని పొనకల్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా కస్తూరి భూమన్న, అధ్యక్షుడిగా లెక్కల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా బొడ్డు రామన్న, అనుముల శ్రీనివాస్, భూతం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అప్పాల జలపతి, కార్యదర్శులుగా ఎడ్ల ఉదయ్, దాసరి శ్రీనివాస్, ఇందూరి సత్తన్న, రాజన్న, కోశాధికారి పూదరి నర్సయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిరుపతి, మల్లేశ్, నాగన్న, రాజన్న, సహాయక కార్యదర్శులుగా రాజెందర్, నర్సయ్య, చంద్రమోహన్ సలహాదారులుగా లచ్చన్న, సత్యనారాయణ, నర్సయ్య, నాగేశ్వర్, రాజన్న, ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

భీమారం: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు పచ్చిరొట్ట కింద ఉపయోగపడే సబ్సిడీ జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో మార్క్ గ్లాడ్‌స్టన్ ఆదివారం తెలిపారు. ఇప్పటికే మూడు విడుతలుగా జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తిరిగి ఇప్పుడు 139బస్తాలు వచ్చినట్లు చెప్పారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకొచ్చి జీలుగ విత్తనాలు పొందాలని ఆయన రైతులను కోరారు.

మహిళల భద్రతకు కృషి



సీఐకి బొకే అందజేస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం: మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా ఆదివారం చిప్ప రాజమౌళి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రతకు చట్టపరిధిలో కృషి చేస్తానన్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వెంకట్ నర్సయ్యను పది రోజుల క్రితం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కుర్చీ ఖాళీ అయింది. 10రోజుల పాటు మహిళా పోలీస్ స్టేషన్‌కు సీఐ ఎవరూ లేకపోవడంతో ఈ నెల 22న జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వీఆర్ (వేకెన్సీ రిజర్వ్‌డ్)లో ఉన్న రాజమౌళి గౌడ్‌ను నియమిస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

బెల్లంపల్లి డివిజన్‌కు ప్రాధాన్యం..!

- సబ్ కలెక్టర్ హోదాతో పరిపాలన మెరుగు



బెల్లంపల్లిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు ప్రభుత్వం సబ్ కలెక్టర్ హోదాను కట్టబెట్టింది. ఇన్నాళ్లుగా ఆర్డీవోలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో పరిపాలన సౌలభ్యం మెరుగు పడనున్నట్లు భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదాను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వీటిలో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ ఒకటి కావడం గమనార్హం. మంచిర్యాల కొత్త జిల్లాగా ఏర్పాటయ్యాక 2016లో తెలంగాణ ప్రభుత్వం బెల్లంపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసింది. తొలుత రెవెన్యూ డివిజన్ అధికారిగా ఆర్డీవోను నియమించగా రెండేళ్ల వ్యవధిలో 2018సంవత్సరంలో సబ్ కలెక్టర్‌ను నియామకం చేశారు. సదరు సబ్ కలెక్టర్ బదిలీ అయ్యాక కొద్ది రోజుల పాటు ఒకరి తర్వాత ఒకరికి ఇరువురు సబ్ కలెక్టర్‌లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తదనంతరం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి సబ్ కలెక్టర్‌లను తప్పించి ఆర్డీవోలను నియమిస్తూ వచ్చారు. తాజాగా హరికృష్ణ ఆర్డీవోగా కొనసాగుతున్నారు. అతి త్వరలో సబ్ కలెక్టర్‌ను బెల్లంపల్లికి బదిలీ చేయనుండటంతో అప్పటి వరకు హరికృష్ణ ఆర్డీవోగా విధులు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఓ మారు మాత్రమే ఐఏఎస్ కేడర్ అధికారిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియమించగా అత్యధిక కాలం ఆర్డీవోల పాలన సాగుతోంది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా దక్కడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మారనున్న అధికారుల పనితీరు...

బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు మండలాలు, ఓ మున్సిపాలిటీ ఉంది. ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది కొందరు సరిగ్గా విధులు నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అదే తీరుగా పనితీరులో తామేమీ తక్కువ కాదన్నా రీతిలో ఇతర శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. రోజువారీగా విధులకు సరిగా హాజరు కావడం లేదు. సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి సరిగ్గా చిత్తశుద్ధిని ప్రదర్శించకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం, ముడుపులు ముడితే కానీ పనులు జరగని పరిస్థితులు కొన్ని శాఖల్లో ఉన్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారిగా ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా రానుండటంతో అధికారుల పనితీరులో మార్పు వచ్చే అవకాశాలు ఉంటాయని ఆశిస్తున్నారు.

ఆగనున్న ప్రభుత్వ భూముల కబ్జాలు...

బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కొంతకాలం నుంచి ప్రభుత్వ భూముల దురాక్రమణ జరుగుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ శ్రేణులు, ఆక్రమణ దారులు భూ కబ్జాలకు తెగ బడటం ఆనవాయితీగా వస్తోంది. వీరి దుశ్చర్యలతో దాదాపు ప్రభుత్వ భూములన్నీ ఈపాటికే అన్యాక్రాంతమయ్యాయి. యథేచ్ఛగా ఆక్రమణలు చేసి, శాశ్వత కట్టడాలు నిర్మించి బాహాటంగానే క్రయ విక్రయాలు చేస్తున్నారు. ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కాపాడటానికి బెల్లంపల్లిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినా, ప్రయోజనం లేకుండా పోయింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో కబ్జాల పర్వం నిరాటంకంగా సాగుతోంది. భూముల ఆక్రమణల్లో సింహభాగం కొందరు మున్సిపల్ ప్రజా ప్రతినిధులదేననే విమర్శలు వస్తున్నాయి. తాజాగా నెన్నెల, తాండూర్, కాసిపేట, భీమిని, వేమనపల్లి, కన్నెపల్లి మండలాల్లోనూ ప్రభుత్వ భూముల దురాక్రమణ సాగుతుండటం విస్మయం కలిగిస్తోంది. వీటన్నింటికి చెక్‌పెట్టి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సబ్ కలెక్టర్ హోదాను రెవెన్యూ డివిజన్‌కు కల్పించారనే ప్రచారం జరుగుతోంది.

అక్షరాస్యతతోనే గిరిజనుల అభివృద్ధి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



గిరిజనులకు సరుకులు అందిస్తున్న ఏసీపీ, సీఐ

తాండూర్: సంపూర్ణ అక్షరాస్యత సాధించడం ద్వారానే గిరిజనులు అభివృద్ధి పథంలోకి రాగలుగుతారని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జాల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ ఆర్మీ వారి సౌజన్యంతో పోలీసులు గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గిరిజనులను విద్యావంతులను చేసేందుకు ఎన్నో పథకాలు తీసుకొచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకుని గిరిజనులు వారి పిల్లలను చదువులో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. తద్వారా ఆర్థికంగా సామాజికంగా గిరిజనులు అభివృద్ధి చెందుతారని సూచించారు. అనంతరం 65 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, అనూష, రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పర్వతిరావు, గంగు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



భీమారం: తనిఖీ చేస్తున్న పోలీసులు

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ఆదివారం ఎస్సై బీ. రాములు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మహారాష్ట్ర వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అనుమానితులు ఎవరైనా వెళ్తున్నారా అనేది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కాగా వాహనాలు నడిపేటప్పుడు వాహనంలో విధిగా వాటి పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉంచుకోవాలని కోరారు.

వేమనపల్లి: వేమనపల్లి-నీల్వాయి ప్రధాన రహదారులపై నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వాహనాలతో వస్తున్న అపరిచిత వ్యక్తులను ఆపి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎటు వెళ్తున్నారు, వాహనాల్లో ఏయే సామగ్రి తీసుకెళ్తున్నారనే వివరాలు సేకరించారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే సమాచారం అందించాలని వాహనపత్రాలు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.

రైతులకు సూచనలు...

వానాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనులు చేసుకోవాలని ఎస్సై శ్యాంపటేల్ సూచించారు. ముల్కలపేట గ్రామపంచాయతీలో ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చిన రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో విద్యుత్ తీగలు, తడిసిన స్తంభాలు, స్టార్టర్ బాక్స్‌ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్



రన్ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

మందమర్రిరూరల్: అంతర్జాతీయ ఒలింపిక్ డే ను మందమర్రిలో క్రీడాకారులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సింగరేణి హైస్కూల్ ముందు గల అంబేద్కర్ విగ్రహం వద్ద క్రీడాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై ఆర్చ్ వెలిగించి జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ రన్ మార్కెట్లోని పలు వీధుల గుండా తిరిగి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ముగిసింది. సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు క్రీడాకారులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ఆదిలాబాద్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోశాధికారి కనపర్తి రమేష్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, సమ్మయ్య, రమేష్, క్రీడాకారులు రాజలింగు, సంతోష్, కళ్యాణ్‌గౌరీ, విశాల, సాయి వర్ష, శృతి, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో కళాభవన్ నిర్మించాలి



మాట్లాడుతున్న కవి మలయశ్రీ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వం చొరవ తీసుకొని కవులు, కళాకారులకు మంచిర్యాలలో కళాభవన్ నిర్మించాలని కవులు, రచయితలు డిమాండ్ చేశారు. స్థానిక క్రిష్ణవేణి హైస్కూల్‌లో ఆదివారం సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు మలయశ్రీ, బిజుమల్ల ఆనందరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాధించి పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కవులు, కళాకారులు తెలంగాణపై వచనం పద్యం గేయంతో స్పందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వామన్‌రావు, అల్లాడి శ్రీనివాస్, కవులు శ్రీనాథ్ గౌడ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువును కాపాడాలని మత్స్యకారుల ధర్నా



మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఈ

జన్నారం: కిష్టాపూర్ ఊర చెరువును కొందరు వ్యక్తులు అక్రమ పట్టాలు చేయించుకొని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, చెరువులో పోసిన మట్టిని తొలగించి చెరువును కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చెరువు వద్ద చర్లపల్లి గ్రామ మత్స్యకారులు ధర్నాకు దిగారు. ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రాజు, సర్వేయర్‌తో చెరువులో సర్వే చేయడానికి వెళ్లి మత్స్యకారులతో మాట్లాడారు. ఈ విషయమై మట్టి పోసిన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడగా సోమవారం తీసివేస్తానని పేర్కొన్నారని డీఈ వారికి తెలిపారు. మట్టి తొలగించి, హద్దులు నిర్ణయించే వరకు ఇక్కడే ధర్నా చేస్తామని మత్స్యకారులు పేర్కొన్నారు. అక్రమ పట్టాలను రద్దు చేసి చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మత్స్యకారుల కుటుంబాలు పాల్గొన్నారు.

పోచమ్మా... సల్లంగ చూడమ్మా



చెన్నూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/జన్నారం పోచమ్మా.. మమ్ముల సల్లంగా చూడు తల్లీ అని భక్తులు గ్రామ దేవతను వేడుకున్నారు. జన్నారం మండలం పొనకల్‌లో మేదరి కులస్తులు, చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి, నాగాపూర్ గ్రామాల్లో, చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో గల కొండపోచమ్మ ఆలయంలో భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మేకలు, కోళ్ల బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక భోజనాలు చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖః సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

సల్లంగా సూడు.. పెద్దమ్మతల్లి

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో వండిన బోనాలు నెత్తిన ఎత్తుకొని, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి, పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో పోచమ్మ బోనాలు..

మండలంలోని ముత్యంపేటలో పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పోచమ్మకు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి, పంటలు బాగుండాలని మొక్కుకున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

బెల్లంపల్లి: 2024-25 విద్యాసంవత్సరానికి స్పోర్ట్స్ స్కూల్‌లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 25న బెల్లంపల్లిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధి కారి పి.మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల విద్యార్థులకు బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతా యని తెలిపారు. ఉదయం 11గంటలకు పోటీలను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి, ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న బాల బాలికలు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు విధిగా తమ వెంట బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



చెన్నూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



భీమారంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని ఆదివారం హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బొలిశెట్టి తిరుపతి, బూత్ అధ్యక్షుడు నడిమెట్ల రాజ్‌కుమార్, స్వామి, నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి: శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని కోటపల్లి మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామయ్య, ప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.


భీమారం: మండల కేంద్రంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు బొర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దుశ్యంత్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు కమ్మల శ్రీనివాస్, బత్తుల సమ్మయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, కేవీఎం శ్రీనివాస్, వెంకటనర్సయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వే సి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, ఆరుముళ్ల పోషం, ఈశ్వరాచారీ, సత్యనారాయణ, బంగారి వేణు పాల్గొన్నారు.

తెల్లకాగితాలపై బిల్లులు..!

- విత్తనాలు అధిక ధరలకు విక్రయం
- అయినా పట్టించుకోని అధికారులు
- మోసపోతున్న రైతులు



చెన్నూర్ మండలంలోని ఓ ఫర్టిలైజర్ డీలర్ తెల్లకాగితంపై రాసిచ్చిన బిల్లు

చెన్నూర్: విత్తనాలు సేకరించి, పంట పడించి అమ్ముకునే వరకూ రైతులు ఏదో విధంగా వ్యాపారులు, దళారుల చేతిలో దగా అవుతున్నారు. మేలైన విత్తనాల కోసం వ్యాపారులు ఎంత చెప్పితే అంతే చెల్లించి, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అమాయకత్వంతో వ్యాపారులు లాభాలు గడిస్తున్నారు. విత్తు విత్తిన దగ్గర నుంచి, గింజలు చేతికి వచ్చే వరకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉండి విత్తనాల దగ్గర నుంచి పంట సలహాల వరకు అందించాల్సిన అధికారులు చుట్టపుచూపుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఫైర్టిలైజర్ షాపులపై అడపా దడప తనిఖీలు చేస్తూ చేతులు దులుపేసుకుంటున్నారు. దీంతో వ్యాపారులు డిమాండ్ ఉన్న విత్తనాలను అధిక ధరలకు అమ్ముతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని చెన్నూర్ మండలంలోని కొందరు ఫర్టిలైజర్ డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ, రైతులను అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు, షాపు పేరుతో జీఎస్టీతో ఉన్న రసీదు ఇవ్వాల్సి ఉండగా తెల్లకాగితాలపై ధరలు వేసి ఇస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అధిక ధరలకు...

పత్తి విత్తన ప్యాకెట్ ధరను ప్రభుత్వం రూ.864 ధర నిర్ణయించింది. డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తన ప్యాకెట్లను విక్రయించాలి. ఇందుకు గాను రైతులకు ఒరిజినల్ బిల్లులను అందించాల్సి ఉంది. కొందరు డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే విత్తనాలు లేవంటున్నారని పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు మండలంలోని ఫర్టిలైజర్స్ షాపులలో తనిఖీలు నిర్వహించి, విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని ఆదేశించాం. ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా, విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

– నంబి శ్రీనివాస్, వ్యవసాయాధికారి, చెన్నూర్

సీసీ కెమెరాలు ప్రారంభం

జైపూర్: మండలంలోని ఇందారం శివాలయం చౌరస్తాలో స్థానిక దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఎస్సై శ్రీధర్ ప్రారంభించారు. వ్యాపారస్తులు అందరూ వారి వ్యాపార సముదాయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా చోరీలను నివారించవచ్చని, ఏ క్షణంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా త్వరగా నిందితులను పట్టుకోవడానికి ఉపయోగపడుతాయన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

తాండూర్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని విద్యాభారతి విద్యాసంస్థల చైర్మన్ సురభి ఆగమరావు అన్నారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విద్యాభారతి బలగం, విద్యా భారతి విద్యాసంస్థల చైర్మన్ సురభి ఆగమ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ వారు 55యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

అనాథ పిల్లలకు పుస్తకాలు అందజేత

తాండూర్: బెల్లంపల్లి మాతృ హృదయం సంక్షేమ సంస్థ సభ్యులు అనాథ పిల్లలకు అండగా నిలిచారు. మండలంలోని శ్రీదేవి స్వశక్తి భారతి అనాథ శరణాలయంలోని అనాథ పిల్లలకు ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.